చెలరేగిన ఇసుక మాఫియా

చోడవరంలో ఇసుక మాఫియా బరితెగించింది. గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖాతరు చేస్తూ బుధవారం నాడు చెలరేగిపోయింది. దాదాపు వంద ట్రిప్పుల్లో టన్నుల కొద్దీ ఇసుకను తవ్వి తరలించింది. కలెక్టర్ ఆదేశాలను అమలుచేయాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతూ గుడ్లప్పగించి చూస్తున్నారు.

- గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు బేఖాతర్
- చోడవరం క్వారీలో భారీగా తవ్వకాలు
- బుధవారం ఒక్కరోజే 100 టిప్పర్లతో ఇసుక తరలింపు



చోడవరం ఇసుక క్వారీలో లారీలు

పెనమలూరు: ఇసుక తవ్వే మాఫియాకు సిగ్గులేదు... అక్రమాలను నియంత్రించాల్సిన అధికారులకు చిత్తశుద్ధి అంతకన్నా లేదు....గ్రీన్ ట్రిబ్యూనల్ ఆదేశాలు ఇచ్చానా అవి బేఖాతర్... ఇది చోడవరం ఇసుక క్వారీలో తంతు. వివరాల్లోకి వెళితే

చోడవరం ఇసుక క్వారీ ఇసుక మాఫియాకు అడ్డాగా మారింది. ఉచిత ఇసుక ఇస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటనలు చేస్తున్నా పచ్చగద్దలు ఇసుక క్వారీపై వాలి కబ్జాచేసి సహజ సంపదను దోచేస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడాలని కూటమి నేతలు చిలకపలుకలు పలుకుతూ ఒక పక్క మొక్కలు నాటుతూ ఊకదంపుడు ప్రసంగాలతో షో చేస్తుండగా, మరో పక్క సహజ వనరులు దోచేసి కాసులు గడిస్తున్నారు. ఇసుక తవ్వకాలు అక్టోబర్ 15వ తేదీ వరకు చేపట్టరాదని ఇటీవల గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశించింది. జిల్లా కలెక్టర్ కూడా ఇసుక తవ్వకాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే ఆ ఆదేశాలను ఇక్కడ ఇసుక మాఫియా తుంగలో తొక్కింది. యథేచ్ఛగా టన్నుల కొద్దీ ఇసుక తరలించేస్తోంది.

చోడవరం క్వారీలో భారీగా తవ్వకాలు

చోడవరం ఇసుక క్వారీలో బుధవారం భారీగా ఇసుక తవ్వకాలు చేపట్టారు. దాదాపు 100 టిప్పర్లు క్వారీలోకి ప్రవేశించి టన్నుల కొద్దీ ఇసుక తవ్వి తరలించుకు పోతున్నాయి. ఇప్పటికే ఇసుక క్వారీలో నిబంధనలకు విరుద్ధంగా నదీ గర్భంలో లోలోతుల్లో ఇసుక తవ్వకాలు చేశారు. దీంతో భూగర్భ జలాల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. కేవలం పచ్చ నేతల లారీలు మాత్రమే ఇక్కడ ఇసుక లోడ్ చేస్తున్నాయి. పచ్చ బ్యాడ్జ్ ఉన్నవారే ఇసుక క్వారీలోకి దిగుతున్నారు. సామాన్యులకు ఇసుక అందని ద్రాక్షే. ఉచిత ఇసుక పథకం ఇప్పటివరకు ఈ క్వారీలో అమలు జరగలేదు.

గ్రామంలో ఇసుక నిల్వలు

చోడవరం గ్రామంలో ఎక్కడ చూసినా ఇసుక గుట్టలు దర్శనమిస్తున్నాయి. కృష్ణానది నుంచి ఇసుక తోడుకు వచ్చి గ్రామంలో స్టాక్ పెడుతున్నారు. నదికి వరద వస్తే అధిక ధరలకు ఇసుక విక్రయాలు చేయాలని మాఫియా పథకం రచించింది. ప్రభుత్వ జీవోకు విరుద్ధంగా ఇప్పటికే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. గ్రామంలో జరుగుతున్న ఇసుక దందాపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక మాఫియా వలన గ్రామంలో ప్రశాంతత కరువైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రజల గోడు పట్టించుకోవటం లేదని మండి పడుతున్నారు.



గ్రామంలో ఇసుక స్టాకు

అధికారులు ఎక్కడ..?

చోడవరం ఇసుక క్వారీలో గ్రీన్ ట్రిబ్యునల్, జిల్లా కలెక్టర్ ఆదేశాలకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు జరుగుతుంటే స్థానిక రెవెన్యూ శాఖ, గనుల శాఖ, పోలీసు శాఖ అధికారులు ఏమి చేస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కోర్టు, కలెక్టర్ ఆదేశాలను అధికారులు ఎందుకు అమలు చేయటంలేదని విమర్శిస్తున్నారు. ఇసుక దందాలో అధికారుల పాత్రపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

నూరు శాతం సబ్సిడీపై పండ్ల మొక్కలు

నున్న(విజయవాడరూరల్): ఉపాధి పథకంలో పండ్ల తోటల మొక్కలను నూరు శాతం సబ్సిడీపై చిన్న, సన్న కారు రైతులకు అందజేస్తామని విజయవాడ సబ్‌కలెక్టర్ కావూరి చైతన్య తెలియజేశారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో సబ్ కలెక్టర్ పాల్గొన్నారు. ఉపాధి పథకంలో మామిడి, జామ, నిమ్మ, సపోట, దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్, కొబ్బరి, ఆపిల్ బేర్, మునగ, మల్లి, గులాబి, అంజీర నూరు శాతం సబ్సిడీపై లభించే పండ్ల తోటల మొక్కలు, వాటి వివరాలను ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, ఏఓ, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, గ్రామ కార్యదర్శి, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నేడు పోరంకిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకిలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు అన్నారు. మహాలక్ష్మీ నగర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుతామన్నారు. ఈ కారణంగా బీజేఆర్‌నగర్, నిడమానూరు రోడ్డు, మహాలక్ష్మీనగర్, వసంతనగర్, విష్ణుపురం కాలనీ, సాయినగర్, బందర్ రోడ్డు, లక్ష్మీపురం కాలనీ, బ్రహ్మంగారి గుడి, రంగా బొమ్మ సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, స్థానికులు సహకరించాలని కోరారు.

క్లుప్తంగా

కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఉత్తమ మార్గం



గన్నవరం: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ''మధ్యవర్తిత్వం-దేశం కోసం'' ప్రచార కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. తొలుత ఈ ర్యాలీని సబ్‌కోర్టు జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.అరుణశ్రీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవడం ఉత్తమమైన మార్గం అన్నారు. దీని వల్ల కక్షిదారులకు డబ్బు, సమయం ఆదా అవుతుందన్నారు. మధ్యవర్తిత్వంపై దేశవ్యాప్త ప్రచారంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించినట్లు చెప్పారు. ర్యాలీలో పలువురు న్యాయవాదులు, ప్యానల్ లాయర్లు, పోలీస్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ హారికకు వైఎస్సార్ సీపీ నేతల పరామర్శ



హనుమాన్‌జంక్షన్ రూరల్: కూటమి ప్రభుత్వ ఉన్మాదులు అధికార మదంతో బీసీ మహిళా ప్రజాప్రతినిధిపై పేట్రేగిన తీరు అత్యంత హేయనీయమని పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు ఖండించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్పర్సన్ ఉప్పాల హారిక, వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ సమన్వయకర్త ఉప్పాల రాము దంపతులపై ఇటీవల గుడివాడలో టీడీపీ, జనసేన గూండాలు దాడికి పాల్పడిన నేపథ్యంలో గన్నవరం నియోజకవర్గానికి చెందిన పలువురు నేతలు బుధవారం పెడన మండలం కూడూరులోని హారిక స్వగృహంలో వారిని కలసి పరామర్శించారు. తామంతా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు గౌసాని, బాపులపాడు జెడ్పీటీసీ సభ్యురాలు కొమరవల్లి గంగాభవాని, బాపులపాడు, ఉంగుటూరు ఎంపీపీలు యర్రగొర్ల నగేష్, వడ్లమూడి సరోజిని, బాపులపాడు వైస్ ఎంపీపీ చందు రమాదేవి, బాపులపాడు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, పార్టీ నాయకులు చందు శ్రీనివాసరావు, కసుకుర్తి శ్రీనివాసరావు, కోమర్తి సాయిరాం పరామర్శించిన వారిలో ఉన్నారు.

దోమల ఫాగింగ్ ఆటోలు ప్రారంభం



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీలో దోమల నివారణకు మూడు ఫాగింగ్ మిషన్లతో ఉన్న ఆటోలను ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. పోరంకి గ్రామంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రూ.20 లక్షల వ్యయంతో 3 ఆటో మేటిక్ ఫాగింగ్ మిషన్‌లు, మూడు కొత్త ఆటోలను తాడిగడప మున్సిపాలిటీ కొనుగోలు చేసింది.ఈ సందర్భంగా కమిషనర్ నజీర్ మాట్లాడుతూ ప్రజారోగ్యం పరిరక్షణకు దోమల నివారణకు ఫాగింగ్ మిషన్‌లు కొనుగోలు చేసినట్టు చెప్పారు

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): కార్మికవాడలోని విద్యుత్ సెక్షన్ పరిధిలో విద్యుత్ శాఖ విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అధికారులు 38 బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 124 కేసులకు గాను రూ.4.08 లక్షలు జరిమానా విధించామన్నారు. ఎన్టీఆర్ సర్కిల్ సూపరింటెండెంట్ విజయకృష్ణ, గుణదల డీఈ పి.హరిబాబు, విజిలెన్స్ ఈఈ పి.విజయకుమారి పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలి



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కాట్రగడ్డ రామచంద్రజోషి

గన్నవరం: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని వామపక్ష నేతలు డిమాండ్ చేశారు. స్థానిక చింతపల్లి పాపారావు స్మారక భవనంలో బుధవారం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్రజోషి మాట్లాడుతూ అధికారంలోకి వస్తే కరెంట్ చార్జీలు తగ్గిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు ఇష్టారాజ్యంగా పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ట్రూఅప్, ఇంధన సర్దుబాటు చార్జీలను తక్షణం రద్దు చేయాలని కోరారు. 2024–25 మధ్య వినియోగదారుల నుంచి అదనంగా వసూలు చేసిన రూ.277 కోట్లు తిరిగి చెల్లించాలని తెలిపారు. గత జగన్ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకించిన చంద్రబాబు ఇప్పుడు ఎందుకు సమర్థిస్తున్నారని సీపీఎం మండల కార్యదర్శి ఎం.ఆంజనేయులు ప్రశ్నించారు. స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వామపక్ష నేతలు బెజవాడ తాతబ్బాయి, అనుమోలు వెంకటేశ్వరరావు, కట్టవరపు విజయరావు, బడుగు మరియదాసు, వెంగళ శివయ్య, మోహన్‌రావు, సూరగాని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వాహనాన్ని రూపొందించిన విద్యార్థులు



గంగూరులో విద్యార్థులు రూపొందించిన విద్యుత్ వాహనం

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో విద్యుత్ వాహనం(ఈ–వెహికల్)ను రూపొందించారు. కాలేజీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగం, విజయవాడకు చెందిన బెస్ట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో గత రెండు రోజులుగా ఏ3–డే హాండ్స్ ఆన్ ఈ వెహికల్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వర్క్‌షాపులో తొలుత మెట్‌ల్యాబ్, పవర్ కన్వర్టర్స్, మోటార్‌లు, బ్యాటరీ మోడలింగ్ ఈవీ సిమ్యులేషన్ వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. చివరిరోజు బుధవారం వర్క్‌షాపు నిపుణుల సహాయంతో ఆరుగురు ప్రయాణించటానికి వీలుగా విద్యుత్ వాహనాన్ని విద్యార్థులు రూపొందించారు. ఈ సందర్భంగా ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ గ్లోబల్ మార్కెట్‌లో విద్యుత్ వాహనాలకు మంచి డిమాండ్ ఉందన్నారు. భవిష్యత్తులో విద్యుత్ వాహనాలు ఆవశ్యకత పెరిగి ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని వివరించారు. పర్యావరణ పరిరక్షణకు విద్యుత్ వాహనాలు ఎంతో మేలు చేస్తాయన్నారు. ఈ వర్క్‌షాపులో వర్క్‌షాప్ రిసోర్స్‌పర్సన్స్‌గా బెస్ట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ బి.రామాంజనేయులు, కె.వంశీ వ్యవహరించారు. కార్యక్రమంలో కాలేజీ కార్యదర్శి భవానిప్రసాద్, డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, డాక్టర్ పి.గురవులునాయుడు, వర్క్‌షాపు కోఆర్డినేటర్ పి.కృష్ణారెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరంకి సొసైటీ సభ్యుల ప్రమాణ స్వీకారం



పెనమలూరు: పోరంకి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన కార్యవర్గం బుధవారం ప్రమాణ స్వీకారం చేసింది. సొసైటీ చైర్‌పర్సన్‌గా మంచినేని పరమేష్, సభ్యులుగా జరుగు రాజా, పోసుబోయిన రవి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ నూతన పాలక వర్గం రైతులకు ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనుమోలు ప్రభాకరరావు, తోటకూర కాశీవిశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వికాస్‌లో 18, 19 తేదీల్లో హెచ్ఆర్ కాంక్లేవ్

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఈ నెల 18, 19 తేదీలలో హెచ్ఆర్ కాంక్లేవ్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ పరమేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. విద్యార్థుల ప్రతిభను పరిశ్రమలకు పరిచయం చేయటానికి, పరిశ్రమలకు కావలసిన నైపుణ్యాలను వివరించి వివిధ రంగాలలోని పరిశ్రమల మౌఖిక పరీక్షలకు తయారు చేయాలనే లక్ష్యంతో దేశంలోని అగ్రశ్రేణి సంస్థల హెచ్ఆర్ లీడర్స్‌ను ఆహ్వానిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఐటీ, ఎంటర్‌ప్రైజెస్, సొల్యూషన్స్, కన్సల్టింగ్, తయారీ, నిర్మాణం, ఫిన్‌టెక్, హెల్త్‌కేర్, ఫుడ్ అండ్ అగ్రికల్చర్ రంగాలకు చెందిన అగ్రశ్రేణి మేనేజర్లు విద్యార్థులతో ప్రత్యక్షంగా సమావేశమై పరిశ్రమలలోని తాజా ధోరణులపై అవగాహన కల్పించి కళాశాల నుంచి ఉద్యోగం వరకు వారి ప్రస్థానానికి మార్గనిర్దేశం చేస్తారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆటో పల్టీ కొట్టి ఎనిమిది మంది మహిళలకు గాయాలు

కంకిపాడు: ఆటో పల్టీ కొట్టి ఎనిమిది మంది మహిళలు గాయపడ్డ సంఘటన మండలంలోని కోలవెన్ను రోడ్డులో బుధవారం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం...కంకిపాడుకు ప్రయాణికులతో వస్తున్న ఆటో అదుపుతప్పి పల్టీ కొట్టింది. ప్రమాదంలో ఎనిమిది మంది మహిళలకు గాయాలయ్యాయి. వీరిలో తీవ్ర గాయాలపాలైన ఎ.విజయలక్ష్మి (35)ని మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. వీరంతా కంకిపాడులోని డ్వాక్రా కార్యాలయంలో సంతకాల పనిమీద వస్తున్నట్లు సమాచారం.

పోలీసుల అదుపులో హత్యకేసు అనుమానితుడు?

కంకిపాడు: హత్యకేసులో అనుమానితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. వృద్ధురాలిని హత్య చేసేందుకు వినియోగించిన చాకును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. ప్రత్యేక బృందాల విచారణలో హత్య కేసులో ఎందరి ప్రమేయం ఉందన్న కోణంలో కేసు దర్యాప్తు కొనసాగుతోంది. వివరాల్లోకి వెళితే...

మండలంలోని మంతెన గ్రామానికి చెందిన తిరుమల స్వర్ణకుమారి (70) ఈనెల 13న తన నివాసంలో దారుణహత్యకు గురయ్యారు. హత్య ఘటనపై డాగ్‌స్క్వాడ్, ఫోరెన్సిక్, క్లూస్‌టీం బృందాలు ఘటన జరిగిన ప్రదేశంలో ఆధారాలు సేకరించేందుకు శ్రమించారు. పోలీసులు నాలుగు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసు విచారణ సాగిస్తున్నారు. కీలకంగా లభించిన సమాచారం ఆధారంగా గడిచిన పది రోజులుగా హత్యకు గురైన స్వర్ణకుమారి నివాసంలో పనిచేస్తున్న తాపీ, టైల్స్, పెయింటింగ్ ముఠా కార్మికులను విడివిడిగా విచారించారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇందులో కీలకంగా ఉన్నట్లు గ్రామంలో ప్రచారం జరగటం, ఇందుకు ఉప్పలూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు సహకరించారని గ్రామంలో చర్చ జోరుగా సాగుతోంది. ఈ కోణంలో విచారణను చేపట్టిన పోలీసులు పనులు చేసేందుకు వచ్చిన వారిలో బిహార్ ముఠా, మరో ముగ్గురు స్థానికులు కనిపించకుండా పోవటాన్ని గుర్తించారు.

చాకు స్వాధీనం

కేసులో ప్రధాన పాత్ర ఉందనే అనుమానంతో ఓ వ్యక్తిని కంకిపాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. విజయవాడ-గుంటూరు రైల్వే స్టేషన్‌ల నడుమ ప్రయాణిస్తున్న ఆ వ్యక్తిని మంగళవారం రాత్రి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వృద్ధురాలిని హత్య చేసే క్రమంలో చేతి మణికట్టును కత్తిరించేందుకు వినియోగించిన చాకును కూడా ఘటనాస్థలానికి కొద్ది దూరంలో ఇంటికి వెనుక వైపున పడి ఉండటంతో దాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. హత్యలో ఎందరి పాత్ర ఉంది? అందుకు గల కారణాలపై సమగ్ర దర్యాప్తు సాగించేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి.

ప్రభాకర్‌ను వెంటనే విడుదల చేయాలి

పెనమలూరు: కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్‌ను వెంటనే విడుదల చేయాలని కృష్ణాజిల్లా కులనిర్మూలన పోరాట సమితి అధ్యక్షుడు తూమాటి శ్రీరాములు డిమాండ్ చేశారు. ఆయన బుధవారం కానూరులో మాట్లాడుతూ రెండేళ్ల క్రితం ఎన్ఐఏ పోలీసులు ప్రభాకర్‌ను అక్రమ అరెస్టు చేశారని, అప్పటినుంచి బెయిల్ మంజూరు చేయకుండా ఎన్ఐఏ అడ్డుపడుతోందని ఆరోపించారు. ప్రభాకర్‌తో పాటు దేశవ్యాప్తంగా జైళ్లలో మగ్గుతున్న ఆదివాసీలను, ప్రజాస్వామ్య వాదులను విడుదల చేయాలని శ్రీరాములు డిమాండ్ చేశారు.

ఈ నెల 19న ఒంగోలులో సదస్సు

దుడ్డు ప్రభాకర్‌ను విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 19వ తేదీన ఒంగోలులో సదస్సు నిర్వహిస్తున్నామని శ్రీరాములు తెలిపారు. ఒంగోలు అంబేడ్కర్ భవనంలో ఉదయం 10 గంటలకు సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు విశ్రాంత జస్టిస్ బి.చంద్రకుమార్, డాక్టర్ ఎంఎఫ్.గోపీనాథ్, కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్రావు, ఉపాధ్యక్షుడు కృష్ణయ్య, కోశాధికారి బాలయ్య, పలువురు ప్రముఖులు పాల్గొంటారన్నారు.

ఉయ్యూరులో ఎరువుల దుకాణాలు మూత

స్క్వాడ్ తనిఖీలతో వ్యాపారుల ఉరుకులు పరుగులు



ఉయ్యూరు: ఉయ్యూరులో ఎరువుల దుకాణాలు మూతపడ్డాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకూ దుకాణాలు తెరవకపోవటంతో రైతులు దుకాణాల వద్దకు వచ్చి వెనుతిరిగారు. దుకాణాలు అన్నీ మూతపడిన విషయంపై ఆరా తీయగా, ప్రత్యేకంగా స్క్వాడ్ బృందం తనిఖీలు చేపట్టడమే కారణంగా తెలిసింది. ఉయ్యూరు పట్టణంతో పాటుగా మండలంలోని పలు గ్రామాల్లో స్క్వాడ్ తనిఖీలు చేస్తున్నారన్న సమాచారం తెలుసుకున్న దుకాణదారులు తమ దుకాణాలు మూసివేసి పరారయ్యారు. దీంతో రైతుల్లో అనుమానాలు రేకెత్తాయి. ఎరువులు, పురుగు మందులు సక్రమంగా ఉంటే ఎందుకు దుకాణాలు మూసివేశారన్న ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. దుకాణాల్లో నాణ్యమైన ఎరువులు లేకుండా కల్తీ ఎరువులు, పురుగు మందులు, రికార్డులు సక్రమంగా లేకపోవటం వల్లే దుకాణదారులు దుకాణాలను మూసివేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

క్రమశిక్షణతో కూడిన విద్య అవసరం



కంకిపాడు: క్రమశిక్షణ, ఏకాగ్రతతో కూడిన విద్య అవసరమని అంగలూరు డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఎంవీజీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు పరీక్షల సన్నద్ధతపై బుధవారం మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు బట్టీ విధానాన్ని విడనాడాలని, పాఠాన్ని అర్థం చేసుకుంటూ చదవాలన్నారు. పరీక్షలకు సన్నద్ధమయే సమయంలో భయాన్ని విడనాడాలన్నారు. ఏకాగ్రతతో విద్యాభ్యాసం సాగించాలన్నారు. పట్టుదల, సాధించాలనే తపన ఉండాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధన సాగించటం ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించొచ్చని ఉపాధ్యాయులకు సూచించారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి నత్తా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో నూరుశాతం ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో అవగాహన పెంపొందించేందుకు మోటివేషన్ క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మేధావుల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పిడికిటి రామకోటేశ్వరరావు, యువజన విభాగం మండల అధ్యక్షుడు తాళ్లూరి మరియబాబు, చోరగుడి మహేష్, ఇన్‌చార్జి హెచ్ఎం బుచ్చియ్యబాబు పాల్గొన్నారు.

ట్రాఫిక్ హోంగార్డుపై దాడి

పెనమలూరు: విధుల్లో ఉన్న ట్రాఫిక్ హోం గార్డుపై వాహనదారుడు దాడి చేశాడు. ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాల ప్రకారం కానూరు అశోక్‌నగర్ టైమ్ ఆస్పత్రి వద్ద ట్రాఫిక్ హోం గార్డు పి.అశోక్ బుధవారం విధులు నిర్వహిస్తున్నాడు. బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి రోడ్డుకు అడ్డంగా బైక్ ఆపటంతో హోంగార్డు అతనిని వెళ్లిపోమని చెప్పాడు. బైక్‌పై ఉన్న వ్యక్తి కొద్ది దూరం వెళ్లి మరల తిరిగి వచ్చి ట్రాఫిక్ హోం గార్డుపై దాడి చేశాడు. ఈ ఘటనలో గాయపడిన హోం గార్డును ఆస్పత్రికి తరలించారు. బైక్ నంబర్ ఆధారంగా దాడి చేసిన వ్యక్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ



పెనమలూరు: మండల పరిధిలో ఎరువుల దుకాణాలను బుధవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు.పెనమలూరు, పోరంకి ప్రాంతాల్లో ఉన్న ఎరువుల దుకాణాల్లో ఎరువుల స్టాక్‌కు సంబంధించి రికార్డులు పరిశీలించారు. ఎరువులు, పురుగుల మందులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు విక్రయిస్తున్నారా లేదో తనిఖీ చేశారు. రికార్డుల్లో ఉన్న ఎరువులు, షాపుల్లో ఉన్న ఎరువులు స్టాకు సరిపోయాయా లేదా అని అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎరువులన్నీ అందుబాటులో ఉంచాలని, ప్రభుత్వ ధరలకే అమ్మాలని ఆదేశించారు. ఎరువుల స్టాక్‌లో తేడాలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ డీఎస్పీ బంగార్రాజు, ఏవో కనకమేడల శైలజ, ఏవో టెక్నికల్ లంకా శ్రీనివాసరావు పాల్గొన్నారు.